# ఈ తరం అమ్మాయిలు

లైఫ్‌స్టైల్ నించి బయటికి వచ్చి ఆటో కోసం చూస్తుంటే సర్రున ఓ కారు వచ్చి పక్కన ఆగింది. తలతిప్పి చూసేసరికి కారులోంచి దిగుతూ 'హాయ్ ఆంటీ' అంటూ చనువుగా చేయి పట్టుకుంది ఓ యువతి - జీన్‌పాంట్ స్లీవ్‌లెస్ షార్ట్ టాప్, కళ్లకి కూలింగ్ గ్లాసెస్, విరబోసుకున్న జుత్తు అల్ట్రా మోడర్న్‌గా వున్న అమ్మాయిని ఆశ్చర్యంగా చూశాను.

''గుర్తుపట్టలేదా ఆంటీ వసుమతి మా అమ్మ'' అంది. కూలింగ్ గ్లాసెస్ తీశాక ఎక్కడో చూసిన మొహంలా అన్పించినా, యింకా సరిగా గుర్తుపట్టలేక పోయిన నాకు వసుమతి కూతురు అనగానే 'వినతీ' నీవా అన్నా సంబరంగా. 'సారీ గుర్తు పట్టలేక పోయాను. చాలా రోజులు.. రోజులేంటి ఏళ్లు, పదేళ్లా, పదిహేనా ఎన్నాళ్లకి చూశాను నిన్ను... ఏమిటి యిక్కడే వుంటున్నావా.. అమెరికాలోనా.. ఏం చేస్తున్నావు.. అమ్మ ఎలా వుంది.. ఎక్కడుంది'' గబగబ ప్రశ్నలు ఒకదాని వెంట ఒకటి తెలియకుండానే వచ్చేశాయి.

వినతి చనువుగా చేయిపట్టుకుని 'ముందు కారెక్కండి ఆంటీ.. నేను మీ యింట్లో డ్రాప్ చేస్తాను. కారులో మాట్లాడుకుందాం... ఈ పాప ఎవరు.... మీ మనవరాలా.. అబ్బాయి కూతురా.. పేరేంటి పాపా.. అడుగుతూనే వెనక డోరు తీసి మమ్మల్నిద్దరిని కారులోకి ఎక్కించింది. అప్పుడు చూశాను కారులో ముందు సీట్లో ఐదేళ్లపాపని.. ఈ పాపెవరు, నీ కూతురా.. ఆశ్చర్యంగా అడిగా - చిన్నగా నవ్వి 'అవును పేరు హరిణి..' నా ఆశ్చర్యం గమనించి కళ్లతో వారించినట్టు చూసింది. ''ముద్దుగా వుంది..' బుగ్గ పుణుకుతూ అన్నాను. పాప అట్టేరంగు లేకపోయినా పెద్ద పెద్ద కళ్లతో బొద్దుగా, చక్కటి జీన్ స్కర్టు, తెల్ల బ్లౌజ్ వేసుకుని చేతిలో

టెడ్డిబేర్‌ని కౌగిలించుకుని కూర్చుంది.

'అమ్మెక్కడ వుంది వినతీ.. మా మధ్య కమ్యూనికేషన్ లేదిప్పుడు. కెనడాలో మీ అన్నయ్య దగ్గర వుందా యింకా...

ఆ... అక్కడే వుంది. అమ్మకి అసలు వంట్లో బాగుండడం లేదు. షుగర్, కీళ్ల నొప్పులు, అక్కడ చలి అసలు పడడం లేదు. కాని వంటరిగా యిక్కడుంచడానికి అన్నయ్య వప్పుకోవడం లేదు. ఇదిగో యిప్పుడు నేనిండియా వచ్చేసాను గదా అమ్మని తీసుకు వచ్చేస్తానింక' అంది.

''అంటే అమెరికా వదిలేసి పర్మనెంట్‌గా వచ్చావా..' ఆశ్చర్యంగా అన్నాను.

''అవునాంటి, యింక అక్కడ వుండ బుద్ధి కావడం లేదు. ఇక్కడ మంచి జాబ్ ఆఫర్ వచ్చింది. మంచి ఇల్లు, జీతం.. అమెరికాకి తీసిపోని జాబ్ ఆఫర్ వచ్చింది. పాపని ఇండియన్ వ్యాల్యూస్‌తో పెంచుకోవాలని పించింది.''

'మాతృదేశానికి దూరంగా బతికాకే యీ దేశం విలువ అర్థమయింది. అక్కడ మెకానికల్, వంటరి జీవితం బోరు కొట్టింది. డబ్బున్నా అంట్లు తోముకుంటూ, ఇల్లు తుడుచుకుంటూ అన్ని పనులు చేసుకోవాలంటే విసుగొచ్చింది. వంటకి మనిషి, పని మనిషి, తోటమాలి, లగ్జరీ లైఫ్ కొన్నాళ్లు ఎంజాయ్ చేయాలనిపించింది' నవ్వి అంది.

ఎక్కడ పనిచేస్తున్నావు. ఎమ్‌బిఏ చేసినట్లున్నావు అమెరికాలో..

''అతి పెద్ద ఎడ్వర్టయిజింగ్ కంపెనీలో క్రియేటివ్ హెడ్‌గా, బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా వున్నాను''

''ఇల్లెక్కడ వుంది.'' 'జూబ్లీహిల్స్‌లో... కంపెనీయే ఇచ్చింది. 'అయ్యో, నీవు నా కోసం యింత దూరం రావటం ఏమిటి. నన్ను దింపేయ్ ఆటోలో వెడతాను. 'వుండండి ఆంటీ, మిమ్మల్ని మా యింటికి తీసికెళతాను. కాసేపు కబుర్లు చెప్పుకున్నాక డ్రైవరుతో యింటి దగ్గర డ్రాప్ చేయిస్తాగా అంది.

మంచి అధునాతన బంగళా, చుట్టూ చిన్నతోట, కళాత్మకంగా దిద్దుకున్న యిల్లు. ఆ యింటి హోదానుచెప్పకనే చెప్తుంది. వంటమనిషితో అప్పటి కప్పుడు వేడి వేడి బజ్జిలు వేయించి యింట్లో వున్న కాజు బర్ఫి, కాఫీ యిచ్చింది. పిల్లలిద్దరూ తిన్నాక 'హరిణి, పూజితకి నీ బొమ్మలు చూపించవా, యిద్దరూ మీ రూములో ఆడుకోండి చక్కగా' హరిణి బొమ్మలా తలాడించి మా మనవరాలి

చేయిపట్టుకుని తన గదిలోకి తీసికెళ్లింది. పాపతో చక్కటి తెలుగులో మాట్లాడడం ఆనందాన్నిచ్చింది.

''వినతీ, యిప్పుడు చెప్పు నీ సంగతులు. ఈ పాప నీ కూతురా..'' ఆరాటంగా అడిగా. వినతి రిలాక్సుగా కుర్చీలో వెనక్కివాలి. 'నా కూతురే.. కాని, పెంచుకుంటున్న కూతురు. అనాధాశ్రమం నించి తెచ్చుకున్నాను.

''నిజంగా.. పోనీలే మంచిపని చేశావు. నీ జీవితానికో ఆలంబన దొరికింది. ఒంటరితనంలో పాప తోడు నీకు కొండంత అండ. మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాను.

''అవునాంటీ ఆరు నెలల పాపని తెచ్చుకున్నక జీవితానికో గమ్యం, అర్థం తెల్సింది. ఓ అనాధబిడ్డని తెచ్చి పెంచడంలో తల్లిప్రేమ అందించడం యింతటి గొప్ప అనుభూతినిస్తుందని తెల్సి వుంటే, ముందే చాలా రోజుల కిందటే చేసి వుండేదాన్ని. ఆ పాప పెరుగుతూంటే చేత్తో నాటిన మొక్క ఆకు తొడిగి, మొగ్గ వేసి నంత సంతృప్తి.. కన్న బిడ్డని పెంచడం ప్రతి తల్లి చేస్తుంది. ఏమికాని ఓ అనాధ బిడ్డని పెంచడంలో ఎంత ఆత్మతృప్తి లభిస్తుందో అనుభవపూర్వకంగా తెల్సుకున్నాను.

''పోనీ మంచిపనిచేశావు. చక్కటి పాప దొరికింది. దానికీ తల్లి, యిల్లు దొరికింది దురదృష్టంలో అదృష్టం అంటే ఇదే కాబోలు...'

''ఇదివరకు ఎందుకు వండుకోడం, ఎవరి కోసం బట్టలు, నగలు, సామాన్లు ఎవరి కోసం యీ డబ్బు, యీ సంపాదన, యీ కార్లు, ఇల్లు ఎవరి కోసం.. అని ఓ విధమైన విరక్తిలో వున్న నాకు పాప రాక జీవితం మీద అనురక్తిని కలిగించింది ఆంటీ.

''అవునవ్మూ.. ఎంత చదివినా, ఎంత సంపాదించినా డబ్బుతో కొనలేనివి కొన్ని వుంటాయమ్మా.. జీవితంలో పెద్దశాపం ఒంటరితనం.. అది భరించలేకనే కదా సర్దుకుపోయి బతుకుతారు నూటికి తొంభై మంది''.

వినతి తలదించుకుంది.. ''నిన్ను బాధపెట్టాలని, దెప్పాలని చెప్పడం లేదు వినతీ! ప్రతి దశలో మనిషికి నేనున్నానని భరోసా యిచ్చే మనిషి కావాలి. చిన్నతనాన తల్లితండ్రులు, వయసులో భర్త, వయసుడిగాక పిల్లలు.. మనిషికి ప్రతి దశలో తోడుండాలి. చదువు కొన్నాం, మా కాళ్ల మీద మేం నిలబడగలం, మాకెవరి అండదండ అక్కరలేదనుకొంటారు ఉడుకు రక్తం వేడిలో. కాస్త వయసు

మీద పడే సరికి వంటరితనం పీడిస్తుంది. ఏదో కావాలన్న తపన. ఏదో కోల్పోయా మన్న దిగులు, తనకెవరున్నారన్న విరక్తి, అన్నీ కల్సి డిప్రెషన్‌లోకి నెడతాయి. ఎందర్నో చూశాను పెళ్లిళ్లు వద్దన్న వాళ్లు. భర్తలతో పడక విడిపోయిన వారు.. రకరకాల కారణాలతో వంటరిగా మిగిలి అన్నీ వుండి ఏమి లేని వారిలా మిగిలిన వాళ్లని చూశాను...''

''పరిస్థితులు అలా వచ్చినపుడు ఏం చేస్తారు ఎవరన్నా.. మీకాలం వాళ్లలా అన్నింటికి తల ఒగ్గి సర్దుకు పోవాలంటారా యీ తరం లోనూ..'' కాస్త రోషం, మరికాస్త బాధ కలకలిసిన గొంతుతో అంది వినతి.

''మా కాలం వాళ్లలా ఏం జరిగినా సర్దుకు పొమ్మనను కాని చిన్న చిన్న విషయాలని గోరంతలు చేసుకుని విడిపోయే పరిస్థితిని చాలా తొందరగా తెచ్చుకుంటున్నారని మాత్రం అన్పిస్తుంది అపుడపుడు. చూడు వినతీ! ఒక యింట్లో యిద్దరు కల్సి బతికే నపుడు అభిప్రాయభేదాలొస్తాయి, మాట పట్టింపులు, అలకలు, అపార్థాలు వస్తాయి. అది అమ్మ అయినా, అక్క అయినా, అన్నైనా వస్తాయి.. అమ్మో, నాన్నో, అక్కో, అన్నో మాట మాట అనుకున్న పట్టించుకోం. మర్చిపోతాం, అలాగే భర్తతో ఎందుకు మర్చి పోకూడదు. ఏదో అవమానం జరిగినట్టు బాధ పడి పోయి మనస్పర్థలు పెంచుకోకుండా సంయమనం పాటిస్తే బాగుండు నేమోననిపిస్తుంది మా తరం వాళ్లకి – ఆఫ్‌కోర్స్ మీ తరం వాళ్లకి ఆర్థిక స్వాతంత్రం లేక సర్దుకొన్నారు మాకేం ఖర్మ వాళ్లతో సమంగా మేమూ సంపాదిస్తున్నాం, సర్దుకు పోవడం అస్తమానూ మేమేఎందుకు చెయ్యాలనుకుంటారు మీరు...''

''అదీ నిజమేగా, ఇన్నాళ్లుగా ఆడదే సర్దుకు పోయింది. యిప్పుడా పని మగ వాళ్లు ఎందుకు చెయ్యరు. ఆడవాళ్ల కంటె మేం ఎక్కువ అన మేల్ ఇగో వాళ్లది''.

''చూడు వినతీ.. ఆడది గడపదాటి మగవాడితో సమంగా ఉద్యోగం చేసే స్థాయికి రావడానికి ఎన్నేళ్లు. ఎన్ని తరాలు పట్టింది వందేళ్లు పైన అలాగే మగవాళ్ల మన్న, వాళ్ల అభిప్రాయాలలోనూ మార్పు వచ్చింది. ఎన్ని వేల సంవత్సరాల నించి ఆటవిక, రాతి యుగం మొదలు పురుష ప్రాదాన్యత వున్న సమాజం అది. ఒక్కరోజులో మారు తుందా. మార్పు అన్నది ఏ ఒక్క రోజులోనూ రాదు. మనం యిప్పుడు సంధి యుగంలో వున్నాం. కాస్తంత ఓర్పుతో యింకొన్నాళ్లు సర్దుకుపోతే యిలా సంసారాలు విచ్చిన్న చేసుకొని కొత్త సమస్యలు తెచ్చుకోవద్దని

నాలాంటి వాళ్ల సలహా''.

''ఇప్పుడిదంతా అనుకోడం ఆలోచించడం అనవసరం ఆంటీ, ఆ పర్వం ముగిసిపోయింది. అతను మరో పెళ్లి కూడా చేసుకున్నాడు'' విరక్తిగా అంది.

''చూశావా, మగాడు ఎంత సుళువుగా జరిగింది మర్చిపోయి రెండో పెళ్లి చేసుకున్నాడో, మరి అంత సుళువుగా నీవు చేసుకోగలిగావా అదే మగ, ఆడ మధ్య తేడా''.

''పాపం, మీ అమ్మ ఎప్పుడూ నీ గురించే దిగులుపడేది. ఫోను చేసినప్పుడల్లా వంటరి దయిపోయింది. పెళ్లి మూన్నాళ్ల ముచ్చటయిపోయింది. ఈ ప్రేమలు, పెళ్లిళ్లు విడిపోవడాలు యివన్నీ మనకి అర్థం కావు. మన సలహాలు, మాటలు విలువ వాళ్లకిప్పుడు అర్థం కావు... నిండా ముప్ఫై ఏళ్లు లేవు యింకా ఎంత జీవితం ఉంది. వంటరిగా బతకాలి మళ్లీ పెళ్లి చేసుకోమంటే ఆ మాటె త్తద్దంటుంది' అమెరికా వెళ్లి పోయే వరకు ఫోను చేసినపుడల్లా నీ గురించే మాట్లా డేది. వినతీ, నీకింకా నలభై ఏళ్లేగా, మళ్లీ పెళ్లి చేసుకోవచ్చు గదా, అందరి మగాళ్లు ఒకలాగే వుంటారనే ముంది.'' నచ్చ చెప్పబోయాను.

వినతి అదోలా నవ్వింది. జవాబివ్వబోయి ఆగిపోయింది. ''సీరియస్ గానే అంటున్నాను వినతీ.. యిప్పటికీ టూ లేట్ అనుకోను..''

''వద్దాంటి ఆ మాటలు వదిలేయండి. మీకు తెలియదు. ప్రతి మగాడికి అమ్మాయి తెలివి, స్మార్ట్‌నెస్, అందం అన్నీ నచ్చుతాయి పెళ్లయ్యేవరకు, పెళ్లి కాంగానే ఆ ప్లస్ పాయింట్స్ అన్ని మైనస్ పాయింట్లుగా కనిపిస్తాయి. ఇగో క్లాష్‌లు మొదల వుతాయి. వారికంటే ఏ విషయంలోనో భార్య అధికంగా వుండడం భరించలేరాంటీ, ఓ విధంగా మా చదువు, ఉద్యోగాలు, సంపాదన మాకే శాపాలుగా మారాయని పిస్తుంది ఒకోసారి. ఇగ్నోరెన్స్ యీజ్ ఎ బ్లిస్ అన్నది రైటేనేమో ఏం తెలీకుండా ఇల్లు భర్తే మనం అనుకునే మీ తరమే సుఖంగా బతికిందేమో.. చదువు సంపాదన అన్ని వుండి మీ కంటె మేం ఏం సుఖపడి ఏడుస్తున్నాం. మగాడి బరువు సగం ఎత్తు కోడానికి గాడిదల్లా చాకిరి చేస్తున్నా.. సంపాదించి మగాడి చేతుల్లో పోస్తున్నాం. అపార్టుమెంట్లు, కార్లు, ఫోన్లు ఎన్ని సౌకర్యాలు యిస్తున్నాం. మీ కోసం అంటూ మీ శ్రమని దోపిడి చేస్తున్నా నారి జన ఉద్ధరోద్ధనులాల ఫోజు పెడ్తున్నారు. మా తెలివి తేటలు, స్మార్ట్‌నెస్ అంతా ఆఫీసుకే పరిమితం, యింట్లో మామూలు యిల్లాళ్లమే'' మనసులో దాగిన కసి, ఉక్రోషం మాటల్లో దూసుకు వచ్చాయి.

''మరీ అంత అన్యాయంగా వున్నరా మగాళ్లంతా. వుంటే యింత మంది ఎలా సంసారాలు చేసుకుంటూ సుఖంగా వున్నారు. భూతద్దంలో చూస్తే అలాగే కనిపిస్తుంది వినతీ. అదో దుస్వప్నం అనుకుని మర్చిపోవాలి''.

''స్వప్నం అయితే లెక్కచెయ్యం మర్చిపోతాం.. నిజాలని మరిచిపోలేం ఆంటీ. వద్దాంటీ, పాత సంగతులు మాట్లాడడం శుద్ద దండగ. నా జీవితంలోకి ఇంకే మగాడూ రాడు''. 'స్థిరంగా అంది.. సరే నా సంగతి వదిలేయండి. నేను పాపతో చాలా హాయిగా వున్నను. నేనేదో కోల్పోయానని భాధపడడం లేదు. ఇన్నాళ్లు ఒక్కటే అసంతృప్తి, చదువని, ఉద్యోగం అని పిల్లలని కనడం ఐదేళ్లు వాయిదా వేస్తూ మాతృత్వానికి దూరం అయ్యానని బాధ వుండేది, మాతృత్వంలో మమత అనుభూతి దొరకలేదే అనుకున్నాను కాని యిప్పుడా కోరిక తీరింది. కనకపోయినా తల్లిప్రేమ అంటే అర్థం అయంది. యింక చాలు నాకింకేం అక్కరలేదు' తృప్తిగా అంది.

మరికాసేపు కబుర్లు చెప్పాక కారులో పంపించింది, మధ్య మధ్య వస్తూండమని చెప్పాను.

★ ★ ★ ★ ★

వసుమతి ఇండియా వచ్చాక వినతి ఫోను చేస్తే వెళ్లి కలిశాను. ఆరోగ్యం బొత్తిగా బాగులేక చిక్కి సగం అయింది. శారీరకంగా, మానసికంగా అలిసిపోయిన దానిలా ఎప్పుడూ కళ్లనీళ్లు పెట్టుకుంది. నన్ను చూసి దానిని ఓదార్చడం, కూతురు గురించి బెంగ పడడంలో అర్థం లేదని, తను యిప్పుడు వంటరిది కాదని కూతురు పెద్దయి తల్లికి అండగా వుంటుందని, తను నిశ్చింతగా, సంతోషంగా వుందని నమ్మించడానికి ప్రయత్నించేదాన్ని.

నెలరోజుల తరువాత వసుమతి నన్నో సారి రమ్మని ఫోను చేసింది. ఆ రోజు ఆమె ముఖం తేటగా వుండి, కళ్లు నిశ్చింతగా కన్పించాయి. నన్ను చూసి చేయి పట్టి లాగి దగ్గర కూర్చోబెట్టుకుంది. 'రాజీ, యీ కాలం పిల్లలు చాలా తెలివైనవారే, మనం వెర్రి మొద్దులం, వాళ్లకేం కావాలో తెలుసు. కావాలన్నది సాధించుకోనూ గలరు, వద్దన్నది వదిలించుకోగల ధైర్యమూ వుంది. మనం మన కోసం కాక లోకం కోసం బతికాం, వాళ్లు వాళ్ల కోసం బతుకుతున్నారు. వాళ్ల బతుకు వాళ్లు యిష్టం వచ్చినట్టు ఎవరిని లెక్కచేయకుండా బతికే ధైర్యం వుంది. ఈ నెలరోజులు వినతిని చూశాక మనం పిచ్చివాళ్లం, వీళ్ల కోసం దిగులుపడుతూ ఏడవక్కర లేదు

అన్నది అర్థమైంది. ఇదే మన కాలంలో మనం యిలా మొగుడిని వదిలి మనిష్టం వచ్చిన ఓ పిల్లని తెచ్చుకు పెంచుకునే సాహసం చేసే ధైర్యం వుండేదా! వినతిని చూడవే ఏ మగాడికీ తీసిపోని పెద్ద ఉద్యోగం, హోదా, స్వేచ్ఛగా తన బతుకు తను బతుకుతూ పిల్లలు లేని లోటు కాకుండా ఆ పాపని తెచ్చుకొని పెంచుతూ మనం ఎవరూ, నా జోలికి ఎవరొస్తారు అన్నట్టు ఎంత నిబ్మరంగా బతుకుతుందో. దాని కెవరూ 'లేరని బాధపడ్డాను ఇన్నాళ్లు. ఈ నెలరోజులు దాని జీవితం చూశాక దానికి ఎవరూ లేక పోవడం ఏమిటి దాని ధైర్యం వందమంది పెట్టు, దాని అత్మ విశ్వాసం కొండంత అండదండ. దాని పట్టుదల దాని వ్యక్తిత్వం పదిమంది భర్తలు ఇవ్వలేనంత భరోసా యిస్తూంది. పనిలో శ్రద్ధ, నిపుణత, తెలివి దాన్ని శిఖరాగ్రాన నిలబెట్టి ఆత్మవిశ్వాసాన్నిస్తూంది. మాతృత్వం లోటు తీర్చుకోడానికి పాపని ఇలాగూ తెచ్చుకుంది. యింక దానికేం లోటు అని నాకు అర్థం అయి ఏదో నిశ్చింతగా వుంది. యీ తరం అమ్మాయిలు బేలగా ఏడుస్తూ జరిగిపోయిందానికి జీవితమే అంతం అయినట్టు భాధపడడం లేదు. దెబ్బ తగిలినా లేచి దులుపుకొని వాళ్ల మార్గం వారే వెతుక్కంటూ ముందుకు సాగుతున్నారు. అలాంటి వాళ్ల గురించి మనకెందుకే దిగులు....'' నా చేయి గట్టిగా పట్టుకుని ఉద్వేగంగా అంది.

మర్నాడు ఉదయమే వినతి నించి ఫోను, నిద్రలోనే తల్లి నిశ్చింతగా కన్నుమూసిందన్న కబురు చెప్పింది.

(చేతన మంత్లీ - ఆగస్టు **2007**)